నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 29 అక్టోబర్ 2024 | VIKARABAD

రంగారెడ్డి కలెక్టర్ శశాంక బదిలీ.. నూతన కలెక్టర్‌గా నారాయణరెడ్డి

రంగారెడ్డి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలకు ముందు రంగారెడ్డి కలెక్టర్‌గా పోస్టింగ్ తీసుకున్న శశాంక బదిలీ అయ్యారు. నల్లగొండ కలెక్టర్‌గా ఉన్న నారాయణరెడ్డిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. గతంలో వికారాబాద్ కలెక్టర్‌గా పని చేసిన నారాయణరెడ్డికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై మంచి పట్టుంది. అతితక్కువ సమయంలోనే తిరిగి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల నిరసన హోరు..

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని డిమాండ్
ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి
గేటుకు వినతిపత్రం అందజేత
వికారాబాద్ జిల్లా కేంద్రంలో విద్యార్థుల భారీ ర్యాలీ, ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్/వికారాబాద్, అక్టోబర్ 28 : ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,300కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే లేకపోవడంతో కార్యాలయం గేటుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, వంశీ, తరంగ్, విప్లవ్‌కుమార్, లక్ష్మణ్, మధు, సంపత్, సందీప్, విక్కీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో భారీ ర్యాలీ..

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, జిల్లా కార్యదర్శి సతీశ్ పాల్గొని మాట్లాడారు. జిల్లా నుంచి సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. జిల్లాలో విద్యా వ్యవస్థను పట్టించుకోవడం లేదన్నారు. కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, ఉన్నత విద్యకు దూరమయ్యే దుస్థితి నెలకొన్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి, అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాకేశ్, నగేశ్, పవన్, అరవింద్, మధు, సిరియాల టౌన్ ప్రెసిడెంట్ తేజ, సిద్ధు, రేహన్, ప్రదీప్, బద్రీనాథ్, పాండురంగారెడ్డి, శివ చైతన్య, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

13 మున్సిపాలిటీలకు.. ఐదుగురే..

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు

పట్టణాభివృద్ధిలో టీపీవో (టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్)ల పాత్ర కీలకం. రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల్లో టీపీవోల కొరత వేధిస్తున్నది. వారి కొరతతో పలు పురపాలక సంస్థల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. భవన నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు టీపీవోలు అందుబాటులో లేని కారణంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఒక్కొక్క టీపీవో మూడు నుంచి నాలుగు మున్సిపాలిటీలను పర్యవేక్షిస్తున్నారు. దీంతో వారు ఒక్కొక్క మున్సిపాలిటీలో రెండురోజుల చొప్పున షిఫ్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. దీంతో టీపీవోలు ఏ రోజు ఏ కార్యాలయాలకు వస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. వారి కొరత కారణంగా నూతన నిర్మాణాలకు అనుమతులలో ఆలస్యంతోపాటు అక్రమ నిర్మాణాలను అరికట్టలేకపోతున్నారు. జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లున్నాయి. 13 మున్సిపాలిటీలకు కేవలం ఐదుగురు మాత్రమే టీపీవోలు ఉన్నారు. అలాగే, కార్పొరేషన్లకు ఒక్క ఏఎస్పీ, ఒక్క టీపీవో, ఇద్దరు టీపీవోలు, ఇద్దరు చైర్మన్లు, మరో ఇద్దరు కార్యాలయ సిబ్బంది ఉంటారు. కార్పొరేషన్లలోనూ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత వెంటాడుతున్నది. టీపీవోల కొరత కారణంగా కమిషనర్లు కూడా ఏమీ చేయలేని పరిస్థితి పర్పడింది. - రంగారెడ్డి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో 13 మున్సిపాలిటీలు..ఐదుగురు టీపీవోలు

జిల్లాలో 13 మున్సిపాలిటీలున్నాయి. ఇవి నగరం చుట్టూ విస్తరించి ఉండడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన అనేకమంది ఈ మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాలు చేపట్టేందు కు ముందుకొస్తున్నారు. దీంతో వారు భవన నిర్మాణాల అనుమతుల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్-బీపాస్ కింద దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోపే అనుమతులివ్వాలని నిబంధన పెట్టినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అవి ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలోని శంషాబాద్, ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, జల్‌పల్లి, నార్సింగి, మణికొండ, శంకర్‌పల్లి, శంషాబాద్, షాద్‌నగర్, ఆమనగల్లు మున్సిపాలిటీలున్నాయి. బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లున్నాయి. ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, షాద్‌నగర్ మున్సిపాలిటీలకు ఒకే ఒక్క టీపీవో ఉన్నారు. ఈ అధికారి ఇబ్రహీంపట్నంలో శుక్ర, శనివారాల్లో, తుర్కయాంజాల్‌లో సోమ, మంగళవారాల్లో, షాద్‌నగర్‌లో బుధ, గురువారాల్లో అందుబాటులో ఉంటున్నారు. అలాగే తుక్కుగూడ, ఆమనగల్లు, నార్సింగి, మణికొండ వంటి ప్రాంతాలకు టీపీవో షిఫ్టు పద్ధతిలో రెండు రోజుల చొప్పున పని చేస్తున్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో టీపీవో ఒక్కరోజు మాత్రమే ఉంటున్నారు. జల్‌పల్లి, ఆదిబట్ల, శంషాబాద్ మున్సిపాలిటీల్లో ఒకే టీపీవో అందుబాటులో ఉంటున్నారు.

రంగారెడ్డి జిల్లాలో టౌన్ ప్లానింగ్ అధికారుల కొరత

షిఫ్టులుగా విధులు.. కుంటుపడుతున్న అభివృద్ధి
ఒక్కొక్క ఆఫీసర్‌కు మూడు నుంచి నాలుగు పురపాలికలు
పర్మిషన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న కొత్త నిర్మాణదారులు
ఇదే అదునుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
మున్సిపాలిటీల ఆదాయానికి భారీగా గండి
ప్రభుత్వం స్పందించి టీపీవోలను భర్తీ చేయాలి : జిల్లావాసులు

టీపీవోల విధులు..

టీపీవోలు మున్సిపాలిటీల అభివృద్ధిలో కీ రోల్ పోషిస్తారు. మున్సిపాలిటీలో చేపట్టే ప్రతి భవనానికీ వారు అనుమతులివ్వాలి. అనుమతి చేసుకున్న భవనాలు ఇతరత్రా గృహ నిర్మాణాలను టీపీవోలు స్వయంగా వెళ్లి చూసిన తర్వాతే అనుమతులివ్వాల్సి ఉంటుంది. మున్సిపాలిటీల్లో జీ ప్లస్-2కు మాత్రమే టీపీవోలు అనుమతులిస్తారు. జీప్లస్-3 నిర్మాణాలు చేపట్టాలనుకునేవారు పదిశాతం భూమిని మున్సిపాలిటీలకు మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ పరిశీలించిన తర్వాతే అనుమతులిస్తారు. అనుమతుల్లేని నిర్మాణాలను గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు. మున్సిపాలిటీల్లో ఉన్న పార్కు స్థలాలనూ పర్యవేక్షిస్తుంటారు. టీపీ వోల కొరత కారణంగా పైన పేర్కొన్నవి సవ్యంగా సాగడం లేదు. ప్రభుత్వం టీపీవోల పోస్టులను భర్తీ చేసి ఇబ్బందును తొలగించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు..

టీపీవోల కొరత కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరు గా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే పలువురు ఐదు నుంచి ఆరు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో జీప్లస్-2తో పాటు పదిశాతం భూమిని మార్టిగేజ్ చేస్తేనే మరో అంతస్తు నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతులిస్తారు. అంతకు మించి జరిగే నిర్మాణాలన్నింటికీ హెచ్ఎం డీఏ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. కానీ కొందరు హెచ్ఎండీఏ నుంచి అనుమతి లేకుండానే పలు మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున బహుళ అంతస్తులను నిర్మిస్తూ మున్సిపాలిటీల ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారుల కొరత తీవ్రంగా ఉండడంతో ఆయా టీపీవోలు.. ఇద్దరు లేదా ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ వ్యక్తులే ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయి.. ఎన్నింటికీ అనుమతులున్నాయి అనే వాటిని పర్యవేక్షిస్తున్నారు. అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న వాటిపైనా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. అలాగే, అనుమతుల్లేకుండా వెలుస్తున్న భవనాలకు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. కానీ, ఎక్కడా అసెస్‌మెంట్లు వేయకపోవడంతో ప్రాపర్టీ ట్యాక్స్‌ను ఎవరూ చెల్లించడంలేదు. దీంతో మున్సిపాలిటీల ఆదాయానికి గణనీయంగా గండి పడుతున్నది.

చౌడాపూర్‌లో అనుమతి లేని క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజ్ (ఫైల్)

తమ వైపునకు ఎవరూ రారనే ధీమాలో
ఆర్ఎంపీలు, నకిలీ వైద్యులు
సీజ్ చేసిన పక్షం రోజుల్లోనే క్లినిక్‌లు మళ్లీ ఓపెన్
వికారాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ పనితీరుపై విమర్శల వెల్లువ
ఇష్టానుసారంగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ వినియోగం
పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీలు..

అర్హత లేకున్నా.. అరకొర వైద్యం..

పరిగి, అక్టోబర్ 28 : తెలిసీ తెలియని, అవగాహన లేని, అశాస్త్రీయ విధానంలో వైద్యం చేస్తూ పేదల ప్రాణాలతో ఆడుకుంటున్న ఆర్ఎంపీలు, నకిలీ వైద్యులపై చర్య లు తీసుకోవడంలో వైద్యారోగ్య శాఖ అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నా యి. ఎప్పుడో ఒకసారి తప్పని పరిస్థితుల్లో వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేసి ఒకటి రెండు ఆర్ఎంపీల క్లినిక్‌లను సీజ్ చేసినా...పక్షం రోజుల్లోనే అవి మళ్లీ కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీజ్ చేసిన క్లినిక్‌లను తెరవాలంటే అనుమతి పత్రాలు, ఇతర వాటిని సమర్పించాల్సి ఉండగా ఇవేవీ లేకుండానే అడ్డదారిలో మళ్లీ యథేచ్ఛగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి

గత మార్చి నెలలో దోమ మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బంటు శ్రీనివాస్ మృతికి పరిగికి చెందిన ఆర్ఎంపీ కారణమంటూ, ఆయనపై చర్యలు తీసుకోవాలని పలువురు డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదే శాల మేరకు మార్చి 22న డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్లు జీవరాజ్, రవీంద్ర, శ్రీనివాస్ విచారణ జరిపి ఆర్ఎంపీ నిర్వహిస్తున్న యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ సెంటర్‌ను నిర్వహించేందుకు ఎలాంటి అర్హతలు, అనుమతుల్లేవని నిర్ధారించారు. గత నెలలో చౌడాపూర్ మండల కేంద్రంలో తనిఖీలు చేసిన అధికారులు ఎస్‌కే, మదిహా డయాగ్నస్టిక్ సెంటర్లు, మదిహా క్లినిక్, రాజ్యలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షిఫా క్లినిక్‌లను సీజ్ చేశారు. అదేవిధంగా శనివారం టీఎంసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో టీఎంసీ సభ్యుడు డాక్టర్ సాయివిజయ్, అరుంధతి, సత్యప్రసాద్, ఎంసీఐ డాక్టర్ల బృందం పరిగి పట్టణంలోని యాసిన్, గ్లోబల్, హనుమాన్, రాఘవేంద్ర, పల్లవి తదితర క్లినిక్‌లలో తనిఖీలు చేయగా.. ఎలాంటి అర్హత, అనుమతుల్లేకుండా బెడ్స్ వేసి పేషెంట్లకు చికిత్స చేస్తున్నారని, ఇష్టానుసారంగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. నకిలీ వైద్యులపై ఎన్ఎంసీ చట్టం 34, 35 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. అర్హత లేకుండా కొనసాగుతున్న క్లినిక్‌లను సీజ్ చేయాల్సిందిగా డీఎంహెచ్‌వోకు నివేదిస్తామన్నారు. ఓ వైద్యుడు తన విద్యార్హత ఎంబీబీఎస్ అంటూ బోర్డుపై రాసుకొని క్లినిక్‌ను నిర్వహిస్తుండగా టీఎంసీ డాక్టర్ల బృందం సర్టిఫికెట్లు అడిగితే చూపించకపోవడం విడ్డూరం.



అల్లోపతి వైద్యానికి అనర్హులు..

ఆర్ఎంపీలు అల్లోపతి వైద్యం చేయరాదు, కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలి. ఏ చిన్న రోగమైనా ఇంజెక్షన్లూ ఇవ్వరాదు. ఇదిలావుండగా ఆర్ఎంపీలు డాక్టర్లమంటూ బోర్డులు వేలాడదీసే వారు.. బీఆర్ఎస్ హయాంలో ఉన్నతాధికారుల చర్యలతో కేవలం ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు అని బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. మిడిమిడి జ్ఞానంతో మందులు రాస్తూ, ఇంజెక్షన్ చేస్తూ రోగుల నుంచి అం దినకాడికి దండుకుంటున్నారు. క్లినిక్‌ల్లోనే నాలుగైదు గదులను ఏర్పాటు చేసి రోగులకు సెలైన్లు పెడుతున్నారు. ఆర్ఎంపీలు హైడోస్ ఇంజెక్షన్లు, మందులు ఇచ్చి రోగం త్వరగా నయమయ్యేలా చేస్తుండడంతో పేదలు ఎంబీబీఎస్ డాక్టర్ల కంటే ఆర్ఎంపీల వద్దకే వైద్యం కోసం వెళ్తుండడం గమనార్హం. కొందరు ఇష్టానుసారంగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు టీఎంసీ డాక్టర్ల బృందం గుర్తించింది. తాము రాసే ప్రిస్క్రిప్షన్ బయటికి పోతే ఇబ్బంది వస్తుందని భావించి బంధువులతో తమ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పక్కనే మెడికల్ షాపులు పెట్టించి.. అక్కడే మందులు కొనుగోలు చేయాలని రోగులకు సూచిస్తున్నారు. ఓ వైపు వైద్యం, మరోవైపు మెడికల్‌షాపుల ద్వారా పలువురు ఆర్ఎంపీలు ప్రతినెలా రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

అడ్డూఅదుపు లేకుండా..

వైద్యారోగ్యశాఖ పనితీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలున్నాయి. అధికారుల తీరుతో ప్రైవేట్ దవాఖానల అక్రమ సంపాదనకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. మరోవైపు ఆర్ఎంపీలు మిడిమిడి జ్ఞానంతో వైద్యం చేస్తూ పేదల ప్రాణాలతో ఆడుకుంటున్నా వారిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా అధికారులు తనిఖీలు చేసి సీజ్ చేసిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు వారం, పది రోజుల్లోనే యథావిధిగా మళ్లీ కొనసాగుతున్నాయి. అధికారుల అవినీతి ఈ పరిస్థితికి కారణం అని కొందరు ఆరోపిస్తుండగా, రాజకీయ నాయకుల ఒత్తిడితోనే తాము అటు వైపు నకు వెళ్లడం లేదని అధికారులు తప్పించుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నకిలీ వైద్యులు, ఆర్ఎంపీల అశాస్త్రీయ వైద్యంపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

అనుమతులు కొన్నింటికే..

బంట్వారం(కోట్‌పల్లి), అక్టోబర్ 28 : బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. అనుమతులు కొన్నింటికే ఉండగా.. పర్మిషన్ లేనివి అధిక సంఖ్యలో ఉన్నాయి. అయితే పరిగి, తాండూరు మండలాల్లో ఎంసీఐ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుండడంతో ఈ రెండు మండలాల్లోని ప్రైవేట్ క్లినిక్‌ల నిర్వాహకుల్లో భయం మొదలైంది. రెండేండ్ల కిందట డీఎంహెచ్‌వో అధికారులు బంట్వారంలో ఓ ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతుల్లేవని గుర్తించి సీజ్ చేశారు. కొన్ని రోజుల తర్వాత స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో మళ్లీ తెరుచుకున్నది. అధికారులు అనుమతులిచ్చారా.. లేదా..? తెలియాల్సి ఉన్నది. అదేవిధంగా కోట్‌పల్లి మండల కేంద్రంలో కొనసాగు తున్న పలు క్లినిక్‌లపై పలు సందేహాలు ఉన్నాయని, అనుమతుల్లేకుండానే అవి నడుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

బిల్లులు వసూలు చేస్తేనే జీతాలు..

ఉద్యోగుల వేతనాలకు జీహెచ్ఎంసీ వెంపర్లాట
కనీసం రూ.100కోట్లయినా వసూలు చేయండి
బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లపై ఉన్నతాధికారుల ఒత్తిడి

జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది.. ప్రభుత్వ ఉద్యోగులకు 1న జీతాలు ఇస్తున్నామని సర్కారు గొప్పలు చెబుతుంటే...వచ్చే నెలలోనైనా కనీసం 1న ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని ప్రతి నెలా చివరి వారంలో బల్దియా ఆరాటపడుతున్నది. కానీ జీహెచ్ఎంసీ ఆర్థిక విభాగం ఆరాటం.. ఆచరణలో సాధ్యపడడం లేదు.. దీనికి కారణం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న బల్దియాను ఆదుకోవడంలో ప్రభుత్వం 'చే'తులెత్తేయడమే.. ఈ పరిస్థితుల్లో ఖజానాను స్వతహాగా బలోపేతం చేసుకునేందుకు ఆస్తిపన్ను వసూలు చేస్తేనే జీతాలు ఇస్తామంటూ కొత్త రాగం ఎత్తుకోవడం ఉన్నతాధికారులకే చెల్లింది.

-సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)

ఆస్తిపన్ను వసూళ్లలో..

జీహెచ్ఎంసీ ఖజానా నానాటికీ బక్కచిక్కిపోతున్నది.. వాస్తవంగా సంస్కరణలతో ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల మెరుగుదల, నిర్మాణ రంగ అనుమతుల ద్వారా ఆదాయం, ఖర్చుల భారం తగ్గించుకోవడం..కానీ ఆస్తిపన్ను వసూళ్లలో కొందరు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల చేతివాటం, రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్ కేటగిరీలోకి మారిన భవనాలపై ఫోకస్ చేయకపోవడం, కొత్త భవనాల అసెస్‌మెంట్‌లో నిర్లక్ష్యం , దాదాపు రూ. 6,900 కోట్ల ఆస్తిపన్ను బకాయిల రాబడిలో పనితీరు శూన్యమనే చెప్పాలి. ఇక గతంలో కంటే నిర్మాణ రంగ అనుమతులు తగ్గడం, ఇప్పటి వరకు రూ.200 కోట్ల మేర లోటు ఏర్పడింది. ఇక ఖర్చుల భారం తగ్గించుకోవాల్సిన సమయంలో ఒకవైపు కార్పొరేటర్లు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం పేరిట టూర్లు వేయగా, దాదాపు రూ.కోటిన్నర ఖర్చు కావడం కొసమెరుపు.

గాడి తప్పిన పాలన

కమిషనర్ నుంచి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో లోపంతో జీహెచ్ఎంసీ పాలన గాడి తప్పింది. పౌరుల మౌలిక సదుపాయాల కల్పన దేవుడెరుగు, ఉద్యోగుల నెలవారీ వేతనాలు సకాలంలో వచ్చే పరిస్థితులు లేవు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ఆర్థిక విభాగం నానా తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఉన్నతాధికారులు ఆస్తిపన్ను బకాయిలు, నెలవారీ టార్గెట్లు పూర్తి చేయాలంటూ బిల్ కలెక్టర్లు , ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 31వ తేదీలోగా రూ. 100కోట్లు వసూలు చేయాలని, అలా చేస్తేనే జీతాలు వస్తాయంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలోనే గత నెల 5న జీతాలు ఇచ్చిన బల్దియా.. పండుగ మరుసటి రోజైనా వేతనాలు వస్తాయా? వచ్చే నెలలో ఎప్పుడు ఇస్తారో అన్న చర్చ ఉద్యోగుల్లో జరుగుతున్నది.